క్లుప్తంగా

పాస్టర్లకు అండగా సీఎం జగన్



పాస్టర్లతో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో పాస్టర్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అండగా నిలిచారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. గురువారం విశ్వేశ్వరాయపురంలో డే స్ప్రింగ్ స్కూల్ హాస్టల్ ఆవరణలో రాజోలు నియోజకవర్గ పాస్టర్ల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. దీనికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో పాస్టర్లకు ఎంతో మేలు జరిగిందన్నారు.

బాలుడి వైద్యానికి చేయూత



బాలుడికి ఆర్థిక సహాయం అందిస్తున్న సంఘ ప్రతినిధులు

మామిడికుదురు: గుండె సమస్యతో బాధపడుతున్న మామిడికుదురు గన్నేరుపుంతకు చెందిన బాలుడు ఇంగువ మనోజ్‌కుమార్ (3) వైద్యానికి గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంఘం రూ.36 వేల ఆర్థిక సాయం అందించింది. సంఘ ప్రతినిధి కట్టా భాస్కరరావు నేతృత్వంలో బాలుడి కుటుంబ సభ్యులకు ఈ సహాయాన్ని గురువారం సంఘ ప్రతినిధులు గుబ్బల శ్రీనివాసు, కట్టా శ్రీను, బైరిశెట్టి వెంకటరమణ, కడలి రాము, దొంగ శ్రీనివాసు అందించారు. యువశక్తి సేవా సంఘం సేవలను మండల శెట్టిబలిజ సంఘ ప్రతినిధులు కాండ్రేగుల శ్రీనివాస్, వాసంశెట్టి శంకర్రావు, యాండ్ర వీరబాబు, కడలి నూకరాజు, పెచ్చెట్టి సత్యచంద్ర కొనియాడారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



వ్యక్తిత్వ వికాసంపై వర్క్‌షాపులో మాట్లాడుతున్న కృష్ణ

రావులపాలెం: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఎం.కృష్ణ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై ఒకరోజు వర్క్‌షాప్‌ను జేకేసీ కోఆర్డినేటర్ వి.శైలజ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విజయవాడకు చెందిన ప్రైవేట్ జాబ్ ప్లేస్‌మెంట్ అధికారి కె.సూరజ్, గుంటూరు ఉన్నతి ఫౌండేషన్ వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఎం.కృష్ణ పాల్గొని మాట్లాడారు. భయం వీడి, ఇంటర్వ్యూలకు మంచి ఆలోచన దృక్పథంతో వెళ్లాలన్నారు. అధ్యాపకుడు బీపీఎస్ రెడ్డి, రమేష్‌బాబు, సిద్ధార్థ, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి కల్పించడమే లక్ష్యం



మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మామిడికుదురు: నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నాబార్డు పని చేస్తుందని ఆ సంస్థ ఏజీఎం సోము నాయుడు తెలిపారు. పెదపట్నంలంక గ్రామ దేవత మహాలక్ష్మమ్మ ఆలయం వద్ద గురువారం క్వాయర్ బోర్డుపై మహిళలకు అవగాహన సదస్సు జరిగింది. యువతతో పాటు మహిళలకు తగిన శిక్షణ ఇచ్చి తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడం సదస్సు లక్ష్యమని ఏజీఎం చెప్పారు. క్వాయర్ బోర్డు రీజినల్ అధికారి టీజే ఏసుదాసు, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్యామ్‌బాబు, హెచ్ఓ శైలజ, డీపీసీ ఐపీఓ మాధురి పాల్గొన్నారు. కోనసీమ కోకోనట్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మన్ వేగి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ పసుపులేటి మహాలక్ష్మీరావు తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



ఖైదీలతో మాట్లాడుతున్న ప్రత్యూషకుమారి

కొత్తపేట: వివిధ కేసుల్లో జైలు జీవితం అనుభవిస్తున్న వారు సత్ప్రవర్తనతో మెలగాలని రాజమహేంద్రవరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.ప్రత్యూష కుమారి సూచించారు. గురువారం కొత్తపేట సబ్ జైలును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులో ఖైదీలతో మాట్లాడి వారి కేసుల వివరాలను తెలుసుకున్నారు. జైలులో సౌకర్యాలను పరిశీలించారు. ఆమె ఖైదీలతో ముఖాముఖి మాట్లాడుతూ జైలు నుంచి బయటకు వెళ్లాక మంచి జీవితాన్ని ప్రారంభించాలన్నారు.

ఆటల్లో అదరగొడదాం..

- ప్రతిభను వెలికితీసేందుకే 'ఆడుదాం ఆంధ్ర'
- క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం
- డిసెంబర్ 15 నుంచి క్రీడా పోటీలు



కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు (ఫైల్)

అలమూరు: కలలను నిజం చేసుకునే సదవకాశమిది... ప్రతిభ చాటేందుకు వచ్చిన వేదిక ఇది.. గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి విద్యార్థులు, యువతలో క్రీడా స్ఫూర్తిని వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్ర' (ఇది అందరి ఆట) పేరిట క్రీడా సంబరాలకు రంగం సిద్ధం చేసింది. డిసెంబరు 15 నుంచి 2024 జనవరి 26 వరకూ ఏకధాటిగా నిర్వహించే ఈ క్రీడా పోటీలపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లోని 11 మండలాల పరిధిలోని నవంబర్ 27 నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. గ్రామ సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ఈ ఆటల పోటీలను నిర్వహణకు సన్నద్ధమవుతున్నారు.

సంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యం

జాతీయ క్రీడలతో పాటు సంప్రదాయ క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రధానంగా క్రికెట్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో పోటీలతో పాటు గ్రామీణ ప్రాంత సంప్రదాయబద్ధమైన చిత్రలేఖనం, వ్యాసరచన, ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. ఈ ఐదు క్రీడలు గ్రామ స్థాయిలో ఐదు రోజులు, మండల స్థాయిలో 12 రోజులు, నియోజకవర్గ స్థాయిలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తారు. అనంతరం జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు ఉంటాయి. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకూ విజేతలకు క్రీడా పరికరాలు, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి విజేతలకు నగదు బహుమతులు అందజేస్తారు. ప్రతి వాలీబాల్ జట్టులో 12, కబడ్డీ 12, ఖోఖో 15, క్రికెట్ 16, బాడ్మింటన్ జట్టులో ఇరువురు చొప్పున క్రీడాకారులు ఉంటారు. ఇవి కాకుండా క్రీడాకారులు ఆసక్తి చూపిస్తే యోగా, టెన్నికాయిట్, 3కే మారథాన్, గ్రామీణ సంప్రదాయ క్రీడలను నిర్వహిస్తారు.

ఆన్‌లైన్‌లో వివరాల నమోదు

గ్రామ, వార్డు సచివాలయాల్లో నవంబర్ 27 నుంచి క్రీడాకారుల నమోదుకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే ఆయా గ్రామాల్లో క్రీడాకారుల జాబితాను వలంటీర్లు రూపొందించారు. 15 ఏళ్లు పైబడిన బాలబాలికలు, మహిళలు, పురుషుల నుంచి సీనియర్ సిటిజన్లు సైతం పోటీల్లో పాల్గొనవచ్చు. నాణ్యతతో కూడిన ఖరీదైన క్రీడా సామగ్రి ఇప్పటికే గ్రామ/వార్డు సచివాలయాలకు చేరుకుంది. సచివాలయాల స్థాయిలో బేసిక్, నియోజకవర్గ స్థాయిలో ప్రొఫెషనల్ క్రీడా సామగ్రి అందించనున్నారు. మండల స్థాయికి ఎంపికైన వారికి టీషర్ట్, క్యాప్, రిస్ట్ బ్యాండ్, జిల్లా, రాష్ట్ర స్థాయి విజేతలకు రూ.ఐదు లక్షల వరకూ నగదు బహుమతి, ట్రోఫీ, మెడల్స్ అందజేయనున్నారు. గ్రామ/వార్డు సచివాలయ స్థాయిలో పోటీల నిర్వహణకు కమిటీ నియమించారు. నియోజకవర్గ, జిల్లా స్థాయిలోనూ కమిటీలను ఏర్పాటు చేశారు.

క్రీడలకు ప్రాధాన్యం బాగుంది



ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నా. గ్రామీణ స్థాయి నుంచి అన్ని వయసుల వారికి నిర్వహిస్తున్న పోటీల ద్వారా ప్రజల్లో క్రీడలపై ఆసక్తి పెరుగుతుంది. దీని ద్వారా గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుంది.

–గరగ వీరబాబు, క్రీడాకారుడు, పినపళ్ల

ఉజ్వల భవిష్యత్తుకు..



గ్రామ, వార్డు సచివాయాల పరిధిలో క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసే అవకాశం ఏర్పడుతుంది. క్రీడల్లో రాణించి జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటొచ్చు. తద్వారా యువత ఉజ్వల భవిష్యత్తు బాటలు వేయవచ్చు.

–పి.సాలెంరాజు, ఎంఈఓ–1, ఆలమూరు

రిజిస్ట్రేషన్ వేగవంతం



సచివాలయ స్థాయిలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేస్తాం. వలంటీర్ల ఫోన్‌లో ఆడుదాం ఆంధ్ర యాప్‌లో వివరాలను నమోదు చేస్తారు. ఈ ప్రక్రియపై ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులకు, వలంటీర్లకు అవగాహన కల్పించాం. ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం పోటీలను నిర్వహిస్తాం.

–కె.జాన్‌లింకన్, ఎంపీడీఓ, ఆలమూరు

రాష్ట్ర చరిత్రలో సంక్షేమ పాలన ఇదే..



అంతర్వేదికరలో పథకాల బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక ప్రసాదరావు

సఖినేటిపల్లి: రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో అన్నివర్గాలకు చేయూతనిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. గురువారం అంతర్వేదికరలో 251వ రోజు ఎమ్మెల్యే రాపాక, ఆయన తనయుడు రాపాక వెంకట్‌రామ్‌తో కలసి అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిపై బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. సాంకేతిక కారణాలతో అర్హులకు పథకాలు అందకపోతే వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ పేదలందరికీ మేలు చేయడానికే ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. జెడ్పీటీసీ సభ్యులు దొండపాటి అన్నపూర్ణ, మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, గ్రామ అధ్యక్షుడు కొల్లాబత్తుల ధర్మారావు, నాయకులు గెడ్డం అమ్ములు, దొంగ నాగ సత్యనారాయణ, దూది త్రినాథ్, బెల్లంకొండ ఏసుబాబు, రుద్రరాజు రంగరాజు, చెల్లుబోయిన గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రగతికి అవిరళ కృషి



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

- కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు

ఆత్రేయపురం: నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో నియోజకవర్గ ప్రగతికి అవిరళ కృషి చేశామని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గురువారం ర్యాలి గ్రామానికి చెందిన వస్కా కాంతిరత్నం, పాలమూరి బేబీ, కోలాటి మోతిలాల్, సురేందర్ వర్మ, బద్దా శతవరుడు, చిగురుపాటి శేఖర్, గొల్లపల్లి నవీన్, దిడ్ల బాలరాజు, అరిగెల సత్తిపండు, గూడపాటి సువర్ణరాజు, శేఖర్ తదితరులు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరారు. వీరికి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీ జిల్లా ఎస్సీసెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, జెడ్పీటీసీ సభ్యుడు బోణం సాయిబాబు, మెర్ల వెంకటేశ్వరరావు, పెన్మెత్స సత్యనారాయణరాజు, ఈలి శ్రీరామచంద్రమూర్తి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు జయపాల్ ఆధ్వర్యంలో వారు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు దోచుకు తిన్నాయన్నారు. నేడు అర్హులకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు చేరుతున్నాయన్నారు. పారదర్శక పాలన అందిస్తున్న సీఎం జగన్‌కు ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని అన్నారు. జగన్ పరిపాలన నచ్చి ర్యాలి గ్రామం నుంచి భారీగా వైఎస్సార్ సీపీలోకి చేరారని, 2024 ఎన్నికల్లో పార్టీ విజయం ఖాయమన్నారు. పేదల పక్షాన తాము ఉన్నందుకే టీడీపీ, జనసేన నాయకులు ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఎవరు ఎన్ని చెప్పినా ప్రజలు సీఎం జగన్ మోహన్‌రెడ్డి పక్షానే ఉంటారన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ఆధునీకరణకు నిధులు

మామిడికుదురు: నాడు–నేడు కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల ఆధునీకరణ, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.24.97 లక్షల నిధులు మంజూరు చేసిందని ఏఈ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అధికారులతో ఏర్పాటైన సమావేశంలో ఈ పనుల నిర్వహణపై చర్చించారు. 25 ప్రభుత్వ భవనాలు, మూడు ఇతర భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలను ఈ నిధులతో ఆధునీకరిస్తామని అన్నారు. పనుల నిర్వహణకు కమిటీని ఏర్పాటు చేయాలని పంచాయతీ రాజ్ ఏఈఈ కృష్ణంరాజు అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోగా పనులు పూర్తి చేసే దిశగా కార్యాచరణ చేపట్టాలని ఎంఈఓ మోకా వెంకన్నబాబు సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.విజయలత, బి.అన్నపూర్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావులపాలెం: విద్యుత్ సబ్‌స్టేషన్, లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రవికుమార్ గురువారం తెలిపారు. దీనివల్ల రావులపాలెం సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అయ్యే అన్ని ఫీడర్లకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కొత్త కార్యవర్గం ఎన్నిక

కొత్తపేట: వాడపాలెం ప్రేయర్ పవర్ చర్చిలో నియోజకవర్గ క్రైస్తవ జేఏసీ నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం జరిగింది. సంఘ అధ్యక్షుడిగా నేల డేవిడ్‌రాజు, ఉపాధ్యక్షుడిగా ఎం.విలియం దాసన్, కార్యదర్శిగా అడపా ప్రసాద్, గౌరవ అధ్యక్షుడిగా ఉగ్రం విల్సన్ ఎన్నికయ్యారు. నియోజకవర్గంలో క్రైస్తవుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామని వారన్నారు. నియోజకవర్గంలోని క్రైస్తవ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐరన్ సిరప్స్ అందజేత

ఆలమూరు: మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఐరన్ సిరప్ డ్రాప్స్ అందజేశారు. ఎనిమియా ముక్తి భారత్‌లో భాగంగా చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, పి.భవానీశంకర్ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు వెళ్లి ఆరు నెలల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు ఈ డ్రాప్స్ వేశారు. ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక సమారాధన

పి.గన్నవరం: స్థానిక గరుడేశ్వరాలయం వద్ద గురువారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. తొలుత ఆలయంలో భక్తులు పూజలు చేశారు. కార్యక్రమానికి గరుడేశ్వర స్వామివారి భక్త బృందం, యూత్ సభ్యులు ఆధ్వర్యం వహించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

రాజోలు: క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ సహకారంతో పౌష్టికాహార కిట్లను గురువారం పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ ఫణికిరణ్ ఆధ్వర్యంలో తొమ్మిది మంది రోగులకు కిట్లు అందజేశారు. క్షయ వ్యాధి నిర్మూలన దిశగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కొంతమంది అవగాహన లేక ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి వేలకు వేలు ఖర్చు చేస్తున్నారన్నారు. సూపర్‌వైజర్లు మద్దాల శ్రీనివాస్, యు.హరిప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ బొక్కా శ్రీనివాస్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

సఖినేటిపల్లి: సమస్యల పరిష్కరించాలంటూ ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా డిసెంబర్ 4న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ఆవేదన దీక్షకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సమగ్ర శిక్షా ఉద్యోగులు ఆవిష్కరించారు. గురువారం స్థానిక విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. బకాయి జీతాలు విడుదల చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని వారు కోరారు.

భావితరాలకు ఆశాకిరణం జగన్

- గ్రామాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్'
- కార్యక్రమానికి అనూహ్య స్పందన



నగరంలో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరణలో వైఎస్సార్ సీపీ శ్రేణులు



మోరిలో పథకాలపై ప్రచారం చేస్తున్న చంద్రశేఖర్, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు

మామిడికుదురు: భావితరాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశాకిరణంలా మారారని పి.గన్నవరం నియోజకవర్గ పార్టీ బూత్ కమిటీల కన్వీనర్ కొండేటి వెంకటేశ్వరరావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము అన్నారు. గురువారం నగరంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. తొలుత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. మండల జేసీఎస్ ఇన్‌చార్జి జక్కంపూడి వాసు, ఎంపీటీసీ సభ్యులు జాలెం అనూష, దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు సజ్జాద్ హుస్సేన్, తేతల మోహన్‌రెడ్డి, కడలి శ్రీను పాల్గొన్నారు.

నరేంద్రపురంలో..

పి.గన్నవరం: నరేంద్రపురం–1 గ్రామ సచివాలయ పరిధిలో వివిధ పథకాలు, అభివృద్ధి పనుల నిమిత్తం ప్రభుత్వం రూ. 14 కోట్లు ఖర్చు చేసిందని నియోజకవర్గ బూత్ కమిటీల కన్వీనర్ కొండేటి వెంకటేశ్వరరావు అన్నారు. మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు ఆధ్వర్యంలో నరేంద్రపురం–1లో వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, తోలేటి బంగారునాయుడు, సర్పంచ్ కొంబత్తుల ఏసుబాబు, మెల్లం మహలక్ష్మి ప్రసాద్, నాయకులు జల్లి పండు, సత్యనారాయణ పాల్గొన్నారు.

మలికిపురం: లక్కవరం సచివాలయం వద్ద ఎంపీడీఓ ముత్యాల వీరాస్వామినాయుడు అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు అడబాల బ్రహ్మాజీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు, పథకాల ద్వారా ప్రభుత్వం రూ.18.61 కోట్లు వెచ్చించిందన్నారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. తొలుత సచివాలయం–1 వద్ద పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. మండల జేసీఎస్ కన్వీనర్ చింతా రాజబాబు, నల్లి శివకుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుర్రం జాషువా, నాయకులు బత్తుల చిన్నిబాబు, ఆచంట కృష్ణ, ముదునూరి కృష్ణంరాజు, కందికట్ల రోజా పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: మోరిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, సర్పంచ్ పి.లక్ష్మీపద్మ మంగతాయారు, ఎంపీటీసీ సభ్యురాలు జానలక్ష్మీదుర్గ సూర్యావతి నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో జరిగిన లబ్ధిపై బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, పెదపాటి నాగలక్ష్మి, చెల్లుబోయిన రాంబాబు, చెల్లుబోయిన రెడ్డి, శ్రేణులు వలవల రాంబాబు, తాడి సహదేవ్, పి.భగవాన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలమూరు: పేద, బడుగు, బలహీన వర్గాల కోసం సీఎం జగన్ అనేక పథకాలను అమలు చేస్తున్నారని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు అన్నారు. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, సర్పంచ్ గుణ్ణం రాంబాబు ఆధ్వర్యంలో గుమ్మిలేరులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పర్యటించి నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధిని వివరించారు. వైఎస్సార్ సీపీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. గ్రామ సచివాలయంలో పల్లెనిద్ర చేసి ప్రజలతో మమేకమయ్యారు. నియోజకవర్గ బూత్ కమిటీ మేనేజర్ నామాల శ్రీనివాసు, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, ఈఓపీఆర్డీ రాజ్‌కుమార్, గ్రామ కార్యదర్శి కె.మోక్షాంజలి పాల్గొన్నారు.



గుమ్మిలేరులో పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

సమన్వయంతో గ్రామాల అభివృద్ధి



మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగలక్ష్మి

పి.గన్నవరం: గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులంతా సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం మండల పరిషత్ సమావేశం జరిగింది. 2024–25 సంవత్సరానికి రూ.65,42,93,500 ఆదాయం చూపుతూ రూ.65,42,35,300 ఖర్చుగా, రూ.58 వేల మిగులుగా అంచనా బడ్జెట్‌ను సమావేశం తీర్మానించింది. పలు గ్రామాల్లో విద్యుత్తు లోఓల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తెలిపారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, మంజూరైన వెంటనే సమస్యను పరిష్కరిస్తామని ఏఈ ఆనందరాజు తెలిపారు. అనంతరం పలు సమస్యలపై చర్చించారు. తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీఓ ఎం.భారతి తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు చట్టం రైతులకు వరం

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి
- ర్యాలిలో 257 మందికి పట్టాల పంపిణీ



ర్యాలిలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

ఆత్రేయపురం: బడుగు, బలహీన వర్గాలకు చెందిన లంక రైతులకు జగనన్న భూహక్కు చట్టం ఓ వరం లాంటిదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గురువారం ర్యాలి గ్రామంలోని లంక భూముల్లో 110 ఎకరాలకు సంబంధించి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 257 మంది రైతులకు శాశ్వత భూ హక్కు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ గతంలో డీక్లాస్, ఏక్‌సాల్ లీజు పట్టాలు ఉండడంతో రైతులకు ఆ భూమిపై శాశ్వత హక్కు ఉండేది కాదని, నేడు జగనన్న ప్రభుత్వంలో అర్హులకు మేలు జరిగేలా శాశ్వత పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు. లంక భూములను పేద రైతులకు శాశ్వతంగా ఇచ్చేస్తే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు వస్తుందని భావించి, దానిని ఎలాగైనా అడ్డుకోవాలని ప్రతిపక్షాలు విశ్వ ప్రయత్నం చేశాయన్నారు. కానీ సీఎం జగన్ పేదల పక్షాన నిలబడి మేలు చేస్తున్నారన్నారు. పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్ మాట్లాడుతూ రైతుల పదేళ్ల కల ఇప్పుడు నెరవేరిందన్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సహకారంతో ఈ పట్టాలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం జగ్గిరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఆర్డీఓ ముక్కంటి, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ నాతి బుజ్జి, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ సభ్యుడు బోణం సాయిబాబు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పెన్మెత్స బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరునికి వైభవంగా బిల్వార్చన



మామిడికుదురులో లక్ష బిల్వార్చన పూజల్లో భక్తులు

మామిడికుదురు: స్థానిక పార్వతీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. నయినాల తమ్మారావు, హైమావతి దంపతులతో పాటు పలువురు భక్తులు కర్తలుగా పాల్గొని పూజలు చేశారు. ఈదరాడకు చెందిన జగన్నాథశర్మ పర్యవేక్షణలో దేవస్థానం అర్చకుడు చంద్రమౌళి శంకరం ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. పార్వతీదేవికి లక్ష కుంకుమార్చన చేశారు. అనంతరం తమ్మారావు ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

అంబాజీపేట: మాచవరంలో పార్వతీ సమేత రాజేశ్వర స్వామి ఆలయంలో శతచండీ సహిత రుద్రయాగాన్ని నిర్వాహకులు సుసర్ల బుజ్జి, మాచిరి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. మహిళలచే కుంకుమ పూజ జరిగింది. అలాగే మాచవరం శివారు కోలివారి అగ్రహారంలో భువనేశ్వరీ సమేత విశ్వేశ్వరస్వామి వారికి లక్షపత్రి పూజ నిర్వహించారు. పుల్లేటికుర్రులో చౌడేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి వారికి రుద్రాభిషేకాన్ని కారుపర్తి నాగమల్లేశ్వరి సిద్ధాంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామివారికి 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకం, కుంకుమార్చన, ధన్వంతరీ హోమం, శాంతి కల్యాణం చేశారు.

రావులపాలెం: స్థానిక పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో దేవతెలికుల సంఘ సభ్యుల ఆధ్వర్యంలో లక్షపత్రి పూజను నిర్వహించారు. వేదపండితులు స్వామివారికి రుద్రాభిషేకం, లక్షపత్రులతో పూజ, హోమం జరిపారు. స్వామివారికి వివిధ అభిషేకాలు చేశారు. అనంతరం కార్తిక వన సమారాధన జరిగింది.

అయినవిల్లి: స్థానిక అన్నపూర్ణాదేవి సమేత విఘ్నేశ్వరస్వామివారి ఆలయం, ముక్తేశ్వరం ముక్తికాంత క్షణముక్తేశ్వర స్వామివారి ఆలయంలో లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పరామర్శ

కొత్తపేట: మాతృ వియోగంతో బాధపడుతున్న అవిడి ఎంపీటీసీ సభ్యుడు ధూళి సూరిబాబును ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించారు. సూరిబాబు తల్లి సీతమ్మ ఇటీవల మృతి చెందగా ఆయనతో పాటు సోదరులను గురువారం సాయంత్రం ఎమ్మెల్యే పరామర్శించారు. అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, సర్పంచ్ రెడ్డి చంటి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి నామాడి రాజరత్నం, కొత్తపేట హెచ్‌డీసీ సభ్యుడు పల్లి దిలీప్, పార్టీ యువజన విభాగం సభ్యుడు బెజవాడ నారాయణరావు తదితరులు ఉన్నారు.

రాత్రి వేళల్లో పోలీసుల ప్రత్యేక నిఘా

ఆలమూరు: ఆకతాయిల అల్లర్లు, ఆగడాలను నిరోధించేందుకు, దొంగతనాలను అరికట్టేందుకు ఆలమూరు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎస్సై ఎల్.శ్రీనునాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది పలు ముఖ్య కూడళ్లలో రాత్రి వేళల్లో పహారా కాస్తున్నారు. సాయంత్రం సమయాల్లో రద్దీగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. రాత్రిళ్లు ఇష్టానుసారంగా బైక్‌లపై తిరుగుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరిస్తున్నారు.